హైదరాబాద్ వార్త



# నగరంలోకి 'థార్‌గ్యాంగ్'

-హైదరాబాద్ వాసులు బెంబేలు
-రాత్రివేళ ప్రజలపై దాడులు, వరుస దోపిడీలు
-గేటెడ్ కమ్యూనిటీలో మొదటి చోరీ
-అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం



**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా 'థార్ గ్యాంగ్' నగరంలోకి ప్రవేశించిందని రాచకొండ పోలీసులు వెల్లడించారు. వరుస దోపిడీలు, దాడులకు పాల్పడే ఈ భయానకమైన దొంగల ముఠా పలు ప్రాంతాల్లో తిరుగుతున్నారని, అన్ని వేళలా నగర ప్రజలను అప్రమత్తంగా ఉండమని హెచ్చరించారు. ఈ క్రమంలో ఎల్.బీ నగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు నగర శివారుల్లోనూ, నిర్మానుష్య ప్రాంతాల్లో ఉంటున్న ఇళ్ళపై ప్రత్యేక దృష్టి పెట్టి, రాత్రుళ్ళు గస్తీ కాసే పోలీసులు పెట్రోలింగ్ పెంచారు. హయత్ నగర్, అమీన్ పురా, బందనకొమ్ము, వనస్థలిపురం, అబ్దుల్లా పూర్, ఘట్‌కేసర్ వంటి పలు ప్రాంతాల్లో వీరు సంచరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ప్రాంతాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీ ప్రజలను రాత్రుళ్ళు ఒంటరిగా తిరగవద్దని చెప్పారు. పదుల సంఖ్యలో సభ్యులుండే థార్ దొంగల ముఠా వేరు వేరు బృందాలుగా విడిపోయి, పగటి సమయంలో ఆటోలో తిరుగుతూ వివిధ ఇళ్ళను గమనిస్తూ రెక్కీ నిర్వహించి, రాత్రుళ్ళు దొంగతనాలు చేస్తారని పోలీసులు చెబుతున్నారు. దోపిడీకి వచ్చిన సమయంలో వీరు తమ ముఖం కనిపించకుండా తల మొత్తాన్ని ముసుగుతో కప్పేస్తారని తెలిపారు. ఇప్పటికే ఈ దొంగల ముఠా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 'ప్రజయ్ గుల్మోహార్ గేటెడ్ కమ్యూనిటీ'లో దోపిడీకి పాల్పడినట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం, దోపిడీ చేసే సమయంలో, తొలుత ప్రహరీ గోడపై ఏర్పాటు చేసిన సోలార్ వైర్లను కట్‌చేసి గేటెడ్ కమ్యూనిటీలోకి చొరబడ్డారు. అనంతరం వరుసగా ఐదు వేరు వేరు ఇళ్ళలో నగదు, బంగారం, వెండి ఆభరణాలను కొల్లగొట్టారు. అడ్డు వచ్చిన ఇంటి సభ్యులపై దాడులు జరిగాయా అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. భయభ్రాంతులకు గురైన గేటెడ్ కమ్యూనిటీ బాధితులు ఈ మేరకు ఫిర్యాదు అందించగా, కేసునమోదు చేసిన పోలీసులు, చోరీకి పాల్పడింది మధ్యప్రదేశ్‌కు చెందిన 'థార్' అనే భయానక దొంగల ముఠాగా విచారణలో తేల్చి చెప్పారు. కాగా థార్ గ్యాంగ్ దోపిడీల కు సంబంధించిన వీడియోలను పోలీసులు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విడుదల చేశారు. నగర శివారుల్లోని గ్రామీణ ప్రజలు అలెర్ట్ గా ఉండాలనీ, అర్ధ రాత్రి పూట ఎవరైనా తలుపు కొడితే ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దని, వచ్చిన వ్యక్తులు ఎవరో నిర్ధారించుకున్నాకే తలుపు తీయాలని హెచ్చరిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమా చారం అందించమని తెలిపారు.

# ప్రైవేట్ బడి..అంతులేని దోపిడీ

-ఇంజనీరింగ్ చదువులకంటే ఎల్‌కెజికే ఎక్కువ
-నర్సరీ,ఎల్‌కెజి చదువులకే లక్షల్లో ఫీజు
-ధనార్జనే ధ్యేయంగా విద్యావ్యాపారం
-స్కూల్ యాజమాన్యాల్లో రాజకీయ నాయకులే అధికం
-అన్నీ తెలిసినా చూసీ చూడనట్లుగా ఉన్నతాధికారులు

**హైదరాబాద్,జూన్ 14,ప్రభాతవార్త:** ప్రపంచాన్ని మార్చే బలమైన ఆయుధం విద్య అని, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షులు నెల్సన్ మండేలా చెప్పిన ఈమాట అక్షర సత్యం అవుతుంది. కానీ అలాంటి ఆయుధం ప్రైవేట్ విద్యాసంస్థల చేతుల్లో బందీ అయిపోయింది.ప్రైవేట్ విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. నిబంధనలకు నీళ్ళొదులుతూ విద్యను ఎరగా చూపుతూ అందినకాడికి దండుకుంటున్నారు. విద్యార్థుల ఫీజులు ఇంజినీరింగ్ కంటే ఎల్‌కెజీకే ఎక్కువగా ఉన్నాయంటే ఏమేరకు దోచుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో తప్పనిసరిగా పెట్టాలన్న నిబంధన కూడా పట్టించుకోవడం లేదు. అలాగే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని తల్లిదండ్రులు కోరుతున్నా ..విద్యాధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని పోతున్నారు. ఎందుకంటే యాజామాన్యులు ఎక్కువగా రాజకీయ నేతలు ఉండటం ఏదైనా మాట్లాడితే తమజాబ్‌కు ఏమైనా ముప్పుఉంటుందనే భయంతో అన్నీతెలిసినా చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపారం ప్రస్తుతం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. తమ పిల్లలను ఉన్నతవిద్యావం తులుగా చేయాలనే తల్లిదండ్రుల నమ్మకాన్ని యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి.



**నర్సరీ, ఎల్‌కెజీకే లక్షలు ..**

ప్రవేట్ కార్పొరేట్ స్కూళ్ల నర్సరీ ఎల్‌కజీ చదువులకు రూ.లక్షల్లో ఫీజులు గుంజుతున్నారు. అడిగే వారు ఎవరూ లేకపోవడంతో మేనేజ్‌మెంట్ ప్రైమరీ క్లాసులకు ఇంజనీరింగ్‌కు మించి ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అడ్మిషన్ రూపం లో కూడా 5 నుంచి 10వేలు వసూలు చేస్తున్నా రు. అలాగే ఏటా 25నుంచి 30శాతం ఫీజులు పెంచుతున్నారు.

**నింబంధనలు ఏం చెబుతున్నాయ్ ..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏస్కూలైనా ఐదు శాతం లాభాలకు మించి పొందడానికి వీల్లేదు. స్కూల్ ఏర్పాటు చేసే సమయంలోనే ఎలాంటి లాభాపేక్ష లేకుండా సామాజిక సేవే లక్ష్యంగా స్కూల్ స్థాపిస్తున్నట్లు అఫిడవిట్ సమర్పిస్తారు. విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులో 50శాతం వేతనాలు ఉపాధ్యాయుల వేతనాలకు కేటాయించాలన్న నిబంధన ఉంటుంది కానీ ఏఒక్క యాజమాన్యం కూడా 20శాతానికి వెచ్చించడం లేదు. పైగా విద్యార్థుల నుంచి ఏటా 25 నుం చి 30శాతం ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఫీజులు పెంచాలంటే జీవో 42 ప్రకారం జిల్లా ఫీజుల క్రమబద్ధీ కరణ కమిటీ అనుమతి తీసుకోవాలి. కానీ ప్రైవేట్ విద్యాసంస్థలు కనీస సమాచారం కూడా ఇవ్వ కుండా ఏటా 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచడం గమనార్హం.

**అటకెక్కిన తిరుపతిరావు కమిటీ సిఫార్సులు..**

ప్రైవేట్ సాఠశాలల్లో అడ్డగోలు ఫీజుల పెంపుపై ప్రభుత్వం 2016లో ఉస్మానియా యూనివర్సిటీ మీజీ విసి ప్రొఫెసర్ తిరుమలరావు నేతృత్వంలో ఓ కమిటీ వేసింది. మౌలిక సదుపాయాలు, విద్యాబోధన ఆధారంగా ఆయా పాఠశాలలను ఎ.బి.సి గ్రేడ్‌లుగా విభజించి 2017లో కమిటీ నివేదిక సమర్పించింది. పెరుగుతున్న నిర్వాహణ ఖర్చుల మేరకు ఏటా 10శాతం ఫీజు పెంచుకోవచ్చునని సూచించింది. దీంతో కార్పొరేట్ యాజమాన్యాలకు ఇది మింగుడు పకడక కోర్టును ఆశ్రయించి కమిటీ సూచనల అమలు ఆదేశాలను నిలుపుదల చేయించి అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నాయి.

# జూలై 7 నుంచి గోల్కొండ బోనాలు



చారిత్రిక గోల్కొండ కోటపై వెలిసిన శ్రీశ్రీశ్రీ జగదాంబిక అమ్మవారి ఆలయం ఇదే.

**నార్సింగి, జూన్ 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అధికారిక పండగ అయిన "బోనాల" వేడుకలను జూలై 7.వ,తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆశాడ మాసంలో జరుపుకునే బోనాల వేడుకలకు సంబంధిత శాఖల అధికారులు పనులు ప్రారంభించాలని ఇఓ సూచనలు జారీ చేశారు. చారిత్రక గోల్కొండ కోటపై ఉన్న శ్రీశ్రీశ్రీ జగదాంబిక అమ్మవారికి తొలిబోనం ఎత్తిన తరువాత తెలంగాణ అంతటా బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ గోల్కొండ బోనాల వేడుకలను జూలై 7.వ,తేదీన ప్రారంభించి ఆగస్టు 4.వ,తేదీన ముగించడం జరుగుతుందని వివరించారు. ప్రతీ ఆది, గురు వారాలలో వరుసగా 9.వారాల పాటు అమ్మవారికి లక్షలాది మంది భక్తజనులు బోనాలు, ముడుపులు సమర్పించుకుంటారని తెలిపారు. జూలై 7.వ,తేదీ(ఆదివారం) మొదటి పూజ 11.న(గురువారం) రెండవ పూజ, 14.న,మూడో పూజ, 18.న నాలుగో పూజ, 21.న ఐదో పూజ, 25.న,ఆరో పూజ, 28.న,ఏడో పూజ, ఆగస్టు 1.వ,తేదీన ఎనమిదో పూజ, ఆగస్టు 4.వ,తేదీన చివరిదైన 9.వ,పూజ నిర్వహించడం జరుగుతుందని ఇఓ శ్రీనివాస రాజు స్పష్టం చేశారు. ఆదివారంతో ప్రారంభమై ఆదివారంతోనే ఈ బోనాల వేడుకలు ముగుస్తాయని, ఈ వేడుకలు శాంతియుతంగా, ఘనంగా ముగిసేందుకు సంఘ సేవలకులు సిరుగుమల్లే రాజు ఉస్తాద్, పీస్ కమిటీ సభ్యులు, హిందూ-ముస్లీం మత పెద్దలు అందరూ పూర్తి సహకారం అందిస్తారని వివరించారు. అలాగే 9.రోజుల పాటు గోల్కొండ కోటపై జరిగే బోనాల వేడుకల సమయంలో ఎలాంటి ఫీజులు వసూలు చేయడం లేదని, భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని ఈవో శ్రీనివాసరాజు తెలిపారు.

**నూతన ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ :**

చారిత్రక గోల్కొండ బోనాల వేడుకల నిర్వాహణకు ప్రతీ రెండేళ్లకు ఓ ట్రస్టుబోర్డును నియమించడం జరుగుతుంది. గత పాలకవర్గం సమయం పూర్తవడంతో రెండు రోజుల వ్యవధిలోనే నూతన ట్రస్టు బోర్డు ఏర్పాటుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తుంది. పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నాయకులు బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గ్రేటర్ పరిధిలో ఉన్న మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది.

# ఈవ్ టీజర్లపై పోలీసుల ఉక్కుపాదం

-పోలీసుల అదుపులో 147 మంది నిందితులు
-ఆకతాయిల్లో 60 మంది మైనర్లు
-11 మందిపై క్రిమినల్ కేసులు

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** ఆడపిల్లలను వేధించే పోకిరీలను ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ పోలీస్ కమీషనర్ తరుణ్ జోషి అన్నారు. శుక్రవారం ఎల్‌బీ నగర్ పోలీసు క్యాంప్ కార్యాలయంలో షీటీమ్స్, ఉమెన్ సేఫ్టీ వింగ్ బృందాల ఆధ్వర్యంలో అరెస్టయిన 147 మంది ఈవ్ టీజర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడారు. మహిళలను, బాలికలను ఈవ్ టీజింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులకు పాల్పడే పోకిరీలను పట్టుకుని తగిన బుద్ధి చెప్పడంతో పాటు, నిందితులని స్టేషన్‌లోనే తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీవింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ, నెల రోజుల వ్యవధిలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 183 మహిళా వేధింపు ఫిర్యాదులు అందాయన్నారు. అందులో ఫోన్ కాళ్ళు, ఎస్ఎమ్ఎస్‌ల ద్వారా వేధింపులకు పాల్పడినవి 30 కేసులు, సామాజిక మాధ్యమాల ద్వారా నమోదయినవి 42 కేసులు కాగా, బాధిత మహిళలను నేరుగా వేధించినవి 111 కేసులు నమోదయినట్లు చెప్పారు. వాటిలో 11 క్రిమినల్ కేసులున్నట్లు పేర్కొన్నారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు తాజాగా రాచకొండ కమీషనరేట్ పరిధిలో ఆడవాళ్ళను నేరుగా వేధిస్తున్న 147 నిందితులను అరెస్ట్ చేశారు. వారిలో 60 మంది మైనర్లున్నట్లు వెల్లడించారు. కమీషనర్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లోని బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్ళు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, పార్కులు తదితర బహిరంగ ప్రదేశాల్లో షీటీం పోలీసులు మఫ్టీలో తిరుగుతూ ప్రజలపై నిఘా వేసినట్లు తెలిపారు. మెట్రో రైళ్ళలోని మహిళా కంపార్ట్ మెంట్‌లో ప్రయాణించే పురుషులపై కూడా నిఘా వేసినట్లు తెలిపారు. ఈవ్ టీజింగ్ చేసేవారిని సాక్ష్యాధారాలతో సహా పట్టుకుని న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు. ఈ వేధింపు ఫిర్యాదుల్లో ముఖ్యమైన కొన్ని కేసుల గురించి పోలీసులు సమాచారమందించారు.

**పోర్న్ వీడియోలు చూపుతూ:**

ఉప్పల్ సబ్ రిజిస్టర్ ఆఫీసులో డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తున్న మహిళను, అక్కడకు వచ్చిన నిందితుడు నోటీసు రాయాలనే సాకుతో, ఆమె ప్రక్కన కూర్చుని ఫోన్లో పోర్న్ వీడియో పెట్టి బలవంతంగా ఆమెకి చూపిస్తూ ఇబ్బంది పెట్టాడు. అనంతరం అక్కడున్న యుపిఐ స్కానర్ ద్వారా ఆమె ఫోన్ నెంబరు తస్కరించి, ఫోన్ కాల్స్ చేస్తూ వేధింపులకు పాల్పడ్డాడు. మల్కాజ్ గిరి షీటీమ్ పోలీసులు నిందితుడిని పట్టుకుని ఉప్పల్ పోలీస్‌స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేశారు.

**పెళ్లి పేరుతో మానభంగం:**

రామాంతపూర్‌కు చెందిన యువతిని ప్రేమ పేరుతో వలలో వేసుకుని పెళ్ళి చేసుకుంటానని మభ్యపెట్టి, ఆమెకు ఇష్టం లేకుండా పలుమార్లు శారీరకంగా అనుభవించిన నిందితుడిపై ఎల్బీనగర్ షీటీమ్ బృందం క్రిమినల్ కేసు నమోదు జైలుకు పంపింది. పలు మార్లు అత్యాచారం చేయడంతో బాదితురాలు గర్భం దాల్చగా నిందితుడు అబార్షన్ చేయించాడని విచారణలో తేలింది. అనంతరం అతడు ఆమెకు కనబడకుండా ముఖం చాటేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

**అసభ్య పధజాలంతో వేధింపులు:**

జవహర్ నగర్ ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించమంటూ మూడేళ్ళుగా వేధిస్తున్న నిందితుడు తరచూ అసభ్యకరమైన పదజాలంతో మెసేజులు పంపుతుండడంతో, కుషాయిగుడా షీటీమ్ బృందం నిఘా వేసి పట్టుకుంది. నిందితుడిపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్‌కేసు నమోదు చేసి రిమాండుకు తరలించడం జరిగింది.

**ప్రేమించకుంటే కుటుంబంతో సహాచం పేస్తా:**

వనస్థలిపురానికి చెందిన యువతిని ఆమె చిన్ననాటి స్నేహితుడు ప్రేమించమని, లేదంటే ఆమెని కుటుంబంతో సహా చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతే కాకుండా, ఆమె డబ్బునీ, బంగారాన్నీ అపహరించాడు. దాంతో రంగంలోకి దిగిన వనస్థలిపురం షీటీం బృందం అతడిని అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేశారు. నగరంలో మహిళలు వేధింపులకు గురైనప్పుడు తక్షణమే షీటీమ్ పోలీసుల వాట్‌సాప్ 8712662111 , 8712662598, 8712662599, 8712662600, 8712662601, 8712662602, 8712662603, 8712662604 నెంబర్లకు తక్షణమే సమాచారమందించమని తెలిపారు.

# మైహోం అవతార్ 14వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య

- మృతురాలు హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ ఉద్యోగి

**నార్సింగి, జూన్ 14 ప్రభాతవార్త :** మైహోం అవతార్ 14.వ,అంతస్థు పైనుంచి దూకి ఓ మహిళా ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం నార్సింగిలో ఉన్న మైహోం అవతావర్‌లో జనార్ధన్‌రెడ్డి, అనురాధ దంపతులు తమ బిడ్డలతో నివాసముంటున్నారు. జనార్ధన్‌రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అనురాధ హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు చేస్తున్నారు. గత కొంత కాలంగా అనురాధ మూఢీగా ఉంటుంది. ఉద్యోగం మాని ఇంట్లోనే ఉండాలని భర్త సూచించాడు. అయినా ఆమె ముభావంగా ఉంటుంది. ఏ విషయంలోనో ఆమె బాధపడుతూ కనిపించేది. శుక్రవారం 14.వ,అంతస్థు పైనుంచి కిందకు దూకేసింది. తీవ్ర గాయాలపాలై ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. భర్త జనార్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్.ఐ అశోక్ తెలిపారు.

# రియల్ మోసానికి పాల్పడిన మీర్‌పేట్ కార్పొరేటర్

-నకిలీ పత్రాలు సృష్టించి రూ.5 కోట్ల మోసం
-అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు



కార్పొరేటర్ నరేంద్రకుమార్ (ఫైల్ ఫోటో)

**సరూర్‌నగర్, మే 14 ప్రభాతవార్త:** భూమి కొనుగోలు విషయంలో తప్పుడు అగ్రిమెంట్ పత్రాలు సృష్టించి రూ.5 కోట్ల మేర రియల్ ఎస్టేట్ మోసానికి పాల్పడిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్ మొక్క నరేంద్రకుమార్ అలియాస్ నందును పోలీసులు అరెస్టు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లాభాలు వస్తాయని తనను నమ్మించిన కార్పొరేటర్ ఇతరుల భూమిని తాను అగ్రిమెంట్ చేసుకున్నట్లు బోగస్ పత్రాలు సృష్టించినట్లు తెలుసుకున్న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు నిందితుడైన కార్పొరేటర్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం బడంగ్‌పేట్ వెంకటాద్రినగర్‌లో నివసిస్తున్న మొక్క నరేంద్ర కుమార్ అలియాస్ నందు మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 13వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నాయి. 2020వ సంవత్సరంలో బిజెపి నుండి కార్పొరేటర్‌గా గెలిచిన ఆయన ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ పార్టీలో ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా చంపాపేట్‌కు చెందిన చిత్తోజు కృష్ణకు పరిచయం అయిన నందు తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాననీ ఇందులో పెట్టుబడి పెడితే అధిక లాభాలు పొందవచ్చని నమ్మించాడు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్‌లో గల 76అ, 74ఆ, 76ఆ, 75ఆ, 74ఇ, 74అ, 75ఇ, 75అ సర్వే నెంబర్లకు చెందిన 6.17 గుంటల భూమిని తుమ్మల ధీరజ్‌రెడ్డి, తోట మాధవరెడ్డి, గుండు శ్రీకాంత్ అనే వ్యక్తులు తనతో పాటు చిత్తోజు కృష్ణ, బొడ్డపల్లి సతీష్‌కుమార్‌లకు నాన్ జూడిషియల్ స్టాంప్ పేపర్‌పై అమ్మవానికి సంబంధించి అగ్రిమెంట్ చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. ఈ మేరకు నమ్మించి చిత్తోజు కృష్ణ నుండి రూ.5 కోట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుందాని కృష్ణ పలు మార్లు నందును అడిగినా వాయిదా వేస్తూ వస్తున్నాడు. దీంతో కృష్ణ నేరుగా సదరు భూ యజమానుల వద్దకు వెళ్ళి అడగగా వారు అసలు తమ భూమిని ఎవరికీ విక్రయించలేదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో ఖంగుతిన్న బాధితుడు మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసును నమోదు చేసిన పోలీసులు కార్పొరేటర్ నందును అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపారు.

# భగవంతాపూర్ బస్తీకి వెళ్లాలన్నా...రావాలన్నా ఒకే రోడ్డు

-ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించకుంటే రాకపోకలు కష్టం



భగవంతాపూర్ బస్తీకి వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌లు,రోడ్డు ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేయడంతో కుచించుకుపోయిన రోడ్డు.

**బేగంపేట జూన్ 14,ప్రభాతవార్త**

నగరం నడి బొడ్డున విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న భగవంతాపూర్ బస్తీకి వెళ్లాలన్నా,రావాలన్నా ఒకటే రోడ్డు.అయితే ఆ బస్తీకి వెళ్లే మార్గంలో ఉన్న ఫుట్‌ఫాత్‌లను ఆక్రమించిన చిరువ్యాపారులు వారి వ్యాపారాలు సాగిస్తుండటంతో వారి వద్ద తినేందుకు,తాగేందుకు వచ్చిన వారు తమ వాహనాలను నడి రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో బస్తీలోకి వెళ్లేందుకు బస్తీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. బస్తీలోకి వెళ్లే గల్లీ ప్రారంభం నుంచి రోడ్డుకు రెండు వైపులా వాహనాల పార్కింగ్‌తో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని బస్తీ వాసులు వాపోతున్నారు.విమానాశ్రయానికి రాజకీయ నాయకులు ఎవరైనా వస్తున్నారంటే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వారు ఆరోపిస్తున్నారు.ఈ బస్తీకి వెళ్లే ప్రారంభంలోనే ఓయో గెస్ట్ హౌస్,ఓ బార్ అండ్ రెస్టారెంట్,ఓ ప్రయివేటు కార్పోరేట్ కార్యాలయాలు ఉన్నాయి.దీంతో అక్కడికి వచ్చిన వారు కూడా తమ వాహనాలను నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే నిలిపివేస్తున్నారు.దీంతో ఈ ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని బస్తీ వాసులు వాపోతున్నారు.పాఠశాలలు ప్రారంభం కావడంతో ఉదయం,సాయంత్రం బస్తీ కి చెందిన చిన్నారులు పాఠశాలలకు వెళ్లి రావాలంటే నరకంగా ఉంటుందంటున్నారు.ఇదే రోడ్డులో విద్యుత్‌శాఖ కార్యాలయం ఉండటంతో అక్కడికి వెళ్లాలన్నా ఇబ్బందిగా మారిందన్నారు.ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించి వెంటనే సమస్యను పరిష్కరించాలని,అధికారులను కోరుతున్నారు.

# నల్లగండ్లలో మహిళ దారుణ హత్య

- కత్తితో గొంతు కోసిన ఆటోడ్రైవర్
-అక్రమ సంబంధమే హత్యకు కారణమా..?
-పోలీసుల అదుపులో ఆటోడ్రైవర్ భరత్‌గౌడ్



నిందితుడు భరత్ గౌడ్ (ఫైల్‌ఫోటో)

**శేరిలింగంపల్లి, జూన్ 14 ప్రభాతవార్త**

నగర శివార్లలో పట్టపగలే ఓ మహిళ దారుణ హత్యకు గురయ్యింది.మానవత్వాన్ని మంటగలుపుతూ ఓ దుండగుడు మహిళను కత్తితో విచక్షణారహితంగా గొంతు కోసి హతమార్చాడు. స్థానికంగా సంచలనం సృష్టించిన ఘటన నల్లగండ్లలోని లక్ష్మీ విహార్ పేజ్-1లో చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి చందానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక సేడం ప్రాంతానికి చెందిన విజయలక్ష్మీ (32) తన భర్త,పదేళ్ల కుమారుడితో కలిసి లక్ష్మీ విహార్‌లో నివాసం ఉంటున్నారు.స్థానిక అపర్ణ టవర్ స్‌లో విజయలక్ష్మీ వంటమనిషఇగా పనిచేస్తుండగా, ఆమె బర్త కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా శుక్రవారం మద్యాహ్నం ఇంట్లో ఉన్న విజయలక్ష్మీని దారుణ హత్యకు గురయ్యింది. ఓ దుండగుడు కత్తితో ఆమె గొంతు కోసి హతమార్చాడు. అనంతరం నిందితుడు చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం కేసు నమోదు చేసుకున్న చందానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**అక్రమ సంబందమే హత్యకు కారణమా..?**

అక్రమ సంబంధమే విజయలక్ష్మీ హత్యకు కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా సంఘటన స్థలికి చేరుకున్న క్లూస్ టీం ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. శేరిలిగంపల్లికి చెందిన ఆటో డ్రైవర్ భరత్ గౌడ్ అలియాస్ శ్రీనివాస్‌గౌడ్ ఫైనాన్స్ నడిపిస్తుంటాడు. ఈ క్రమంలో మృతురాలు విజయలక్ష్మీ తమ్ముడు సునిల్ ఆటో కొనేందుకు గతంలో భరత్ గౌడ్ ఫైనాన్స్ ఇచ్చాడు. ఆ డబ్బులు విషయంలో వారి మధ్య ఘర్షణ జరిగినట్లు,ఇటీవల కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో భరత్ గౌడ్ కేసు పెట్టినట్లు సమాచారం. తర్వాత వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుకుని వారం రోజుల క్రితమే కోర్టులో కేసు విత్‌డ్రా కూడా చేసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా భరత్ గౌడ్ ఈ రోజు విజయలక్ష్మీని కత్తితో నరికి చంపాడు. ఆమెను అంత కిరతంగా ఎందుకు హత్యచేశాడనే విషయం తెలియాల్సి ఉంది. చందానగర్ పోలీసుల కేసును అన్ని కోణాలలలో పరిశీలిస్తున్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

**కొంపల్లి, జూన్ 14, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపలిలోని బివిఆర్ఐటి కళాశాల ఎదురుగా ఉన్న ప్రసన్న నిలయంలో పెంట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై బాచుపల్లి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 12మందిని పోలీసుల అరెస్టు చేశారు. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయవర్గాల ద్వారా పోలీసులకు సమాచారం రావడంతో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహిచినట్లు తెలిపారు. బంకురి అప్పన్న (40), కావూరి శైలజ (53), చిత్తారి గోపిచంద్ (64), మజ్జి వర్మ (38), శంభు తిరుపతి (47), జి.హెచ్.సింహాచలం (51), వెంకట రమణ సిరిపురపు (59), గంధం సూర్యనారాయణ మూర్తి (42), ఏ.వేణు (57), కొల్లి రమేష్ (70), కంచరన్ల వెంకటేశ్వరరావు (57), సూరంపల్లి మోహన్ కృష్ణ (64) నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి 11 సెల్‌ఫోన్లు, రూ. 1,63,180 నగదు, 20 సెట్ల ప్లేయింగ్ కార్డులు, 205 గేమ్ కాయిన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా నిందితులు వాడుతున్న పలు బ్యాంకుల అకౌంట్‌లలోని రూ. 3,79,114 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

## ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

### -కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ వార్డు 3 సిల్వర్ కంపెనీ,నారాయణ జోపిడి ప్రాంతంలోని డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**బేగంపేట జూన్ 14,ప్రభాతవార్త**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తానని,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.శుక్రవారం కంటోన్మెంట్ పరిధిలోని వార్డు 2 రసూల్‌పుర,సిల్వర్ కంపెనీ ,నారాయణ జోపిడీ ప్రాంతంలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.అనంతరం శ్రీగణేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసారు.ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు.మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల సహకారంతో పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూంల కేటాయింపు చేస్తామని ఆయన తెలియజేసారు.ఈ కార్యక్రమంలో బద్రియాదవ్, నయూం,మల్లేష్,యాదగిరి,వహబ్,జరియాన,షమ్మి,నాసర్,గఫార్,చాంద్‌భాషా,సలీం తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్‌కి జవాన్ అసోసియేషన్ మద్దతు



అభివాదం చేస్తున్న ఐఎన్‌టియుసి, తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు అమరేశ్వర్,నాగన్న గౌడ్, మల్లిఖార్జున్,తదితరులు

**హైదరాబాద్, జూన్ 14,ప్రభాతవార్త:**

జిహెచ్ఎంసి తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్‌కు ఐఎన్‌టియుసి అఫ్లేషన్ ఇచ్చింది. ఈనేపథ్యంలో శుక్రవారం జవాన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేష్, జనరల్ సెక్రటరీ, కార్యవర్గం సమస్యలపై మీటింగ్ జరిపి యూనియన్‌కు మద్దతు ప్రకటించారు. ఈకార్యక్రమంలో అడ్వైజర్ నాగన్నగౌడ్, స్టేట్ జనరల్ సెక్రటరీ ఐఎన్‌టియుసి మల్లికార్జున్, బి.నందకిశోర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ,సెక్రటరీ జనరల్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ అమరేశ్వర్, ట్రెజరర్ దామోదర్ ,సురేష్ పాల్గొని వివిధ సమస్యల మీద చర్చించారు. ఈసందర్భంగా తమకు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపి సమస్యల పరిష్కారమే ధ్యేయమంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## బిసి విద్యార్థుల కొరకు గురుకుల పాఠశాలలు పెంచండి

### -గురుకులాల సెక్రటరీ సైదులుకు విక్రంగౌడ్, శ్యాం కురుమ వినతి



గురుకులాల సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న విక్రంగౌడ్, శ్యాంకురుమ తదితరులు

**హైదరాబాద్,జూన్ 14,ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసిగురుకుల పాఠశాలలు విద్యార్థులకు సరిపోవడం లేదని అప్లై చేసుకున్న వారిలో 25శాతం మందికే అవకాశాలు దక్కుతున్నాయని కావున విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని బిసి గురుకుల పాఠశాలలు మరిన్ని పెంచాలని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్, యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యాంకురుమ గురుకులాల సెక్రటరీ బి.సైదులును కోరారు. ఈమేరకు శుక్రవారం సెక్రటరీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులాలను పెంచడంతోపాటు ఉన్న గురుకులాల్లో వర్కర్లను ,టీచర్లను పెంచాలని కోరారు. అలాగే ప్రతి పదోతరగతి విద్యార్థికి ట్యాబ్ అందించి డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గురుకులాలకు విశాలమైన సొంతభవనాలు నిర్మించాలని, విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేసి మంచి ఆహారం, గ్లేజర్లు, పడక మంచాలు, యూనిఫాం , పుస్తకాలు అకాడమిక్ ఇయర్ ప్రారంభంలోనే అందించే విధగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బిసి జనసైన్యం అధ్యక్షులు సింగం నగేష్ గౌడ్, బిసి విద్యార్థిసంఘం రాష్ట్ర కార్యదర్శి ఇంద్రం రజక, గణం నర్సింహ కురుమ, మట్ట భాస్కర్‌గౌడ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను తక్షణమే పరిష్కరించండి : ఎమ్మెల్యే



డిసికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, జూన్ 14 ప్రభాతవార్త:**

అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని అల్వాల్ ఇన్‌చార్జ్ డిసికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటుగా కార్పొరేటర్లు మూడు డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు వినతి పత్రం అందించారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో డిసి మల్లారెడ్డితో ఎమ్మెల్యేతో పాటుగా కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనీల్ కిషోర్ ఇతరులు సమావేశం అయ్యారు. అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వరద ముంపు, డ్రైనేజీలులో పూడికతీత పనులు, బాక్స్ డ్రైన్‌లు, సిసి రోడ్లు నిర్మాణం, పారిశుధ్యం తదితర సమస్యలను డిసికి వివరించారు. టెండర్లు పూర్తయి వర్క్ ఆర్డర్లు తీసుకున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజావసరాలు దృష్ట్యా తక్షణం పనులు ప్రారంభించాలని ఆయన కోరారు.

## ప్రతి రక్తపు బొట్టు జీవితాన్ని కాపాడుంది

**యూసుఫ్‌గూడ, జూన్ 14, ప్రభాతవార్త :**

ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసే ప్రతి రక్తపు బొట్టు జీవితాన్ని కాపాడుం దని కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో డాక్టర్ పి.వి రవిశేఖర్ రెడ్డి రక్తదానం చేశారు. ప్రతి సంవత్సరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే రక్తదాన శిబిరంలో తాను రక్తదానం చేస్తున్నానని పేర్కొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి పంచదశ బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రబంధ పారాయణం

**నాంపల్లి, జూన్ 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలో ఎస్‌బిహెచ్ కాలనీ వద్ద గాంధీనగర్‌లో ఉన్న అతిపురాతన శ్రీ సంగమేశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో 6రోజులపాటు జరిగే శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పంచదశ వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నేటినుండి 19 బుధవారం వరకు జరుగనున్న ఈ బ్రహ్మోత్సవాల్లో స్వామివారి విశేష కైంకర్యములలో ఈరోజు రాత్రి 6 గంటల నుండి ప్రబంధ పారాయణము ఎంతో భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ బ్రహ్మోత్సవాల్లో రేపు 15 శనివారం ఉదయం 7గంటల నుండి సేవాకాలం, రాత్రి 7గంటల నుండి పరమ పదోత్సవము; 16 ఆదివారం ఉదయం 8గంటల నుండి ఉత్సవారంభ స్నపనం, నూత్తందాది, చాత్మర, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, చతుస్థావర్చన, ద్వజాదిహోమం, ధ్వజారోహణం; రాత్రి 7గంటల నుండి నిత్యహోమము, బేరీపూజ, దేవతాహ్వానము, నిత్యపారాయణాదుల ప్రారంభం; 17 సోమవారం ఉదయం 9గంటల నుండి నిత్యహోమము, శ్రీలక్ష్మీ సుదర్శన యాగము, ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 7 గంటల నుండి నిత్యహోమము, రథోత్సవము, శ్రీవారి కళ్యాణోత్సవం; 18 మంగళవారం ఉదయం 9గంటల నుండి మహాపూర్ణాహుతి, చక్రస్నానము, కుంభప్రోక్షణ, సాయంత్రం 5గంటల నుండి పుష్పయాగము, ద్వాదశారాధన, దేవతోద్వాసన, ధ్వరావరోహణం, రాత్రి 8గంటల నుండి డోలోత్సవం, బ్రహ్మోత్సవ పరిసమాప్తి, పండిత సన్మానము, వేద ఆశీర్వచము; 19 బుధవారం ఉదయం 8గంటల నుండి శతఘటాభిషేకం ఇత్యాధి పూజా కార్యక్రమాలు నిర్వహించబతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ కమిటీ వివరించింది.

## నయనానందకరం శ్రీశివానంద నృత్యోత్సవం-2024



నృత్యోత్సవంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూన్ 14 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సద్గురు శ్రీ శివానంద నృత్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో నృత్యోత్సవం నయనానందకరంగా ఆహుతుల హృదయాలకు హత్తుకుపోయింది. ప్రఖ్యాత నాట్యగురువు బి.సుధీర్‌రావు శిష్యులు ఆయన నృత్య సంగీత దర్శకత్వంలో నృత్యోత్సవం-2024 శీర్షికన జరిగిన నాట్యప్రదర్శనలో ముందుగా తాండవ నృత్యకరితో ప్రారంభించి అనంతరం జతిస్వరం; కొలువై ఉన్నాడే; రామ కోదండరామ; త్యాగరాజ కీర్తన సాధించెనే; లింగాష్టకం; శృంగార లహరి; రారవేణు; వెడలేర వయ్యారులు; బృందావని సారంగ్ తిల్లానా తదితర అంశాలను చక్కని లయ శృతిబద్ధంగా అద్భుత హావభావాలను ముఖ ఆంగిక కవళికల విన్యాసాలతో నవరసభరితంగా నర్తించి విచ్చేసిన అశేష నాట్యప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, ప్రఖ్యాత నాట్యగురువు ఆచార్య అలేఖ్య పుంజాల, ప్రముఖ నాట్యగురువు బి.సుధీర్‌రావు తదితరులతో కలిసి నృత్యోత్సవంలో ప్రదర్శనలిచ్చిన కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

# కొత్తపేటలో గంజాయి బ్యాచ్ వీరంగం

**ఎల్‌బినగర్, జూన్ 14 ప్రభాతవార్త:** గంజాయి మత్తులో పలువురు యువకులు వీరంగం సృష్టించారు. గంజాయి మత్తులో ఓ వ్యక్తిపై మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా చితకబాదారు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపేటలో అర్ధరాత్రి వరకు రోడ్డుపై బైఠాయించి గంజాయి తాగుతున్న పోకిరీలను అక్కడే నివాసం ఉంటున్న ఇంటి యజమాని జనార్ధన్ నాయుడు ప్రశ్నించడంతో అప్పటికే పూర్తి మత్తులో ఉన్న యువకులు విచక్షణ కోల్పోయి అతనిపై విరుచుకు పడ్డారు. మమ్ముల్ని వెళ్లమంటావారా అంటూ జనార్ధన్ నాయుడుపై గంజాయి బ్యాచ్ కర్రలు, రాళ్లతో దాడి పాశవిక దాడికి పాల్పడ్డారు. గంజాయి బ్యాచ్ దాడిలో జనార్ధన్ నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దాడికి గురైన బాధితుడి కుటుంబ సభ్యులు సంఘటనకు సంబంధించి శుక్రవారం సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా జనార్ధన్ నాయుడుపై దాడి చేస్తున్న దృశ్యాలను స్థానికులు సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. అయితే ప్రతిరోజు కాలనీలో గుర్తు తెలియని యువకులు బయట నుంచి వచ్చి న్యూసెన్స్ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పోలీసుల అదుపులో నిందితులు..**

బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో గంజాయి బ్యాచ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నేతాజీనగర్‌లో బుధవారం రాత్రి జనార్ధన్ నాయుడు ఇంటి ముందున్న ఖాళీ స్థలానికి కాపాలా ఉంటున్న కొందరు వ్యక్తులు ప్రతి రోజు మద్యం, గంజా తాగుతూ చుట్టు పక్కల వారిని భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో, జనార్ధన్ నాయుడు వారిని ఇక్కడ న్యూసెన్స్ చేయవద్దని హెచ్చరించడంతో మద్యం, గంజా మత్తులో ఉన్న దుండగులు జనార్ధన్ నాయుడుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అంతేగాక జనార్ధన్ నాయుడి ఇంటిపై దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితులు భరత్‌నగర్ కాలనీకి చెందిన మడ్డి శంకు(25), గడ్డిరాజు వంశీ(26), చేగోని హరీష్(20), బొంజి సాజిద్ అలీ ఖాన్(23), ఎద్దుల కంటి మనోజ్(17), బొమ్మల గండి హయత్‌నగర్‌కు చెందిన మహ్మద్ సోను(16), మహ్మద్ రెహన్ అలియాస్ ఆదిల్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

### -గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్



జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలతో చర్చిస్తున్న కార్పోరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై ఎటువంటి చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గోల్నాక కార్పోరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలకు సూచించారు. శుక్రవారం కార్పోరేటర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు సంబంధించి డివిజన్ ఎస్ఎఫ్ఏ లతో బస్తీలలో పచ్చదనం, పరిశుభ్రతకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన ముందస్తు చర్యలపై ఆమె కొన్ని సూచనలు చేశారు.

## కలుషిత నీటి సరఫరా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### -కార్పొరేటర్ పన్నాల



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పన్నాల

**నాచారం, జూన్ 14 ప్రభాతవార్త :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మంచినీటిలో ఎక్కడ కూడా కలుషిత నీరు సరఫరా కాకుండా జలమండలి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్‌లోని వార్డు కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఓల్డ్ మల్లాపూర్, బ్రహ్మపురి కాలనీ, అశోక్‌నగర్, నెహ్రూనగర్, చండియానగర్, సూర్యనగర్, బాబానగర్ తధితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య లు తలెత్తకుండా చూడాలని ఆయన సూచిం చారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీ పైపుల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## మల్లన్నను కలిసిన మాజీ కౌన్సిలర్ దయానంద్



**అత్తాపూర్ జూన్14,ప్రభాతవార్త :** ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన తీర్మార్ మల్లన్నను జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ,మాజీ కౌన్సిలర్ దయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నకు పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కోరని దయానంద్ మాట్లాడుతూ....తీర్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేయడం జరిగిందని ఎన్నో కేసులు కూడా భరించారని చివరికి మల్లన్నను అపహరించి జైలులో కూడా వేయడం జరిగిందన్నారు.పట్టభద్రులు అన్ని రకాల ఆలోచించి వరంగల్,ఖమ్మం,నల్గొండ ఓటర్లు మంచి మెజార్టీతో గెలిపించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు.

## నెమలి ఆనంద్‌కు అభినందనల వెల్లువ

**బేగంపేట జూన్ 14,ప్రభాతవార్త**

ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాటం చేస్తానని బీ జే పీ నాయకులు నెమలి ఆనంద్ (నందు) అన్నారు. గురువారం మాతాజీనగర్ ఎఫ్ టీ ఎల్ లో అక్రమ నిర్మాణాలన్నింటినీ నేలమట్టం చేసారు.ఆ స్థలంలో మొక్కల పెంపక కేంద్రం (నర్సరీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు లు ఏర్పాటు చేసారు.దీంతో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన నెమలి ఆనంద్‌ను కాలనీ వాసులు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు,ఆకుల మహేష్, మధుసూధన్,దయానంద్‌తో పాటు బస్తీ, కాలనీల సంఘాల నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌తో పట్టుబడ్డ ఇద్దర యువకులు

**మైలార్‌దేవ్‌పల్లి,జూన్ 14 ప్రభాతవార్త :** జల్సాలకు అలవాటు పడి సునాయాసంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశ్యంతో గుట్టు చప్పుడు కాకుండ డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 4.7 గ్రాముల ఎండిఎంఎ,44 వేల రూపాయల నగదుతో పాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం....శాస్త్రిపురంకు చెందిన అబ్దుల్ సోహెల్ (25),సయ్యద్ నవాజ్ (19)లు స్నేహితులు.జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు స్నేహితులు డబ్బుల సంపాదన కోసం గుట్టు చప్పుడు కాకుండ డ్రగ్స్ విక్రయిస్తున్నారు.కాగా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎస్ గార్డెన్ సమీపంలో సయ్యద్ సోహెల్,సయ్యద్ నవాజ్‌లు అనుమానస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకున్నారు.వారి వద్ద నుంచి 4.7 గ్రాముల ఎండిఎంఎ,44 వేల రూపాయల నగదుతో పాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**మూసాపేట్, జూన్ 14, ప్రభాతవార్త**

మూసాపేట్ వై జంక్షన్ నుండి ప్రశాంత్ నగర్ కమాన్ వరకు ఉన్న అక్రమణలను శుక్రవారం ఏసీపీ రమేష్, డీసీ కృష్ణయ్య, చైన్‌మెన్ నగేష్, మచ్చిందర్‌ల ఆధ్వర్యంలో తొలిగించారు. ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురి ఫిర్యాదు మేరకు రోడ్డుపై ఇబ్బందికరంగా ఉన్న అక్రమ నిర్మాణాలు తొలిగించారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తుందన్న ఉద్దేశ్యంతో కొంతకాలంగా అధికారులు తొలగించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కాగా పలు బాటసారులు, వాహనదారులు స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ అక్రమ నిర్మాణాలను తొలగించడం జరిగిందని అధికారులు తెలిపారు.

## 21నుంచి 23వరకు హైలైఫ్ ఎగ్జిబిషన్

**హైదరాబాద్,జూన్ 14,ప్రభాతవార్త:** ఈనెల 21నుంచి 23 వరకు హైటెక్‌సిటీలోని హెచ్‌ఐసిసి నోవాటెల్‌లో హైలైఫ్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు నిర్వాహలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నటీమణులు దివి, అమీక్షా పవార్ చేతుల మీదుగా కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఫ్యాషన్ ప్రియులు, మోడల్స్ హాజరై ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. దేశంలోని అగ్రశ్రేణి జ్యువెల్లరీ డిజైనర్లు తయారు చేసి నటువంటి ఆభరణాలను, వివిధ కళాఖండాలను ఈప్రదర్శనలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మూడు దురోజుల పాటు జరిగే ఈకార్యక్రమానికి ఆభరణాల ప్రియులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బోనాల జాతరకు నిధులు కేటాయించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నేతలు

**సికింద్రాబాద్, జూన్ 14 ప్రభాతవార్తః** జూలైలో జరుగబోయే ఆషాడ బోనాల జాతరకు నగరంలోని దేవాలయాలలో ఉత్సవాలు నిర్వహించడానికి రూ. 25 కోట్లు ప్రత్యేకంగా కేటాయించాలని కోరుతూ హైదరబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్ గౌడ్ కోరిన విధంగా నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు పవన్‌కుమార్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరంలో ప్రతియేటా జరుగుతున్న ఆషాడమాస బోనాల జాతర అత్యంత భక్తి శ్రద్దలతో ప్రజలు నిర్వహించుకుంటారని, కాబట్టి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ యాదవ్, బాబురావు, జగదీష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్,నోట్ బుక్స్ పంపిణీ

**మైలార్‌దేవ్‌పల్లి,జూన్ 14 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఉన్న కాటేదాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి స్కూల్ యూనిఫామ్స్ ,నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్బంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాణిక్యం, ఉపాధ్యాయులు రఘుపతి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్ధన్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, టి.చిన్న, ఎన్ను కృష్ణారెడ్డి, పాండు యాదవ్, ఎల్‌వి.రెడ్డి, మధు, రవి, అమర్, ప్రభుదాస్, రామారావు ,శేఖర్ పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో 'బడిబాట' కార్యక్రమం

### -అక్షరాభ్యాసం చేయించి ప్రారంభించిన కార్పొరేటర్ పావనీవినయకుమార్

**చిక్కడపల్లి, జూన్ 14 ప్రభాతవార్త:** పిల్లలకు మంచి విద్యను అందించి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపైనే ఉందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్సార్టీ క్వార్టర్స్‌లోని జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 'బడిబాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యాపరంగా పిల్లలకు కావాల్సిన సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, బిజెపి నేతలు శ్రీకాంత్, కృష్ణప్రసాద్, ఎం.ఉమేశ్, ఆనంద్‌రావు, ఆకుల సురేందర్, నవీన్ కుమార్, శ్రీనివాస్, సాయికుమార్, పాఠశాల హెడ్‌మాస్టర్ స్వర్ణలత, టీచర్లు రేణుకా, ఉమామహేశ్వరి, సంగీత, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బలమైన శక్తిగా తెలంగాణ జనసమితి

### -గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య

**చిక్కడపల్లి, జూన్ 14 ప్రభాతవార్త:** తెలంగాణ జనసమితి బలమైన శక్తిగా రాష్ట్రంలో బలమైన శక్తిగా ముందుకు సాగుతోందని సమితి గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ తెలంగాణ జనసమితి అధ్యక్షుడు గుండెల్లి రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినం దించే కార్యక్రమం జరిగింది. ఈ సమితి ముషీ రాబాద్ నియో జకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీని వాస్‌యాదవ్, అడిక్‌మెట్, కవాడీగూడ డివిజన్ అధ్యక్షులు కాకునూరి సుధాకర్, అజయ్‌గౌడ్, నగర ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు జస్వంత్‌కుమార్, నగర కార్యదర్శి పి.సుధాకర్, నగర నాయకులు పవన్, కెవి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించిందని, ఇదేరీతిలో భవిష్యత్తులో కూడా కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు నోటు పుస్తకాలు, పలకలను అందించారు.

## విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందజేత



వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్కులు అందజేస్తున్న కార్పోరేటర్ దేదీప్య విజయ్ కుమార్

**యూసుఫ్‌గూడ, జూన్ 14, ప్రభాతవార్త :**

ఉత్తమ పౌరుడుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందని వెంగళరావునగర్ కార్పోరేటర్ దేదీప్యవిజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బక్కులు, యూనిఫాంలు, పలకలు, ఇవ్వడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఫోమియానాయక్‌రాథోడ్, నాయకులు విజయ్‌ముదిరాజ్, నర్సింగరావు, శ్యామ్‌రావు ముదిరాజ్, వేణు, అర్జున్, మహబూబ్, జనార్ధన్, దశరథ్, వాణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు



వివేకానందనగర్‌లోని శ్రీభూనీల సమేత వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ నిర్వహిస్తున్న పురోహితులు.

**యూసుఫ్‌గూడ, జూన్ 14, ప్రభాతవార్త :**

శ్రీవివేకానందనగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ భూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పుష్కర(12వ) బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఉదయం నుంచే సుప్రభాత సేవ నిత్యారాధన యాగశాలలో ద్వారతోరణ ధ్వజ కుంభారాధనలు, మంగళస్నానాలు, అలంకరణ, తీర్ధ ప్రసాద వితరణ, సాయంత్రం విష్ణుసహస్ర నామ పారాయణం, యాగశాలలో అమ్మవారికి విశేష అలంకరణలో లక్ష్మీదేవి కుంకుమార్చన, ఎదురుకోళ్ళ ఉత్సవం, తదితర పూజలను నిర్వహించారు.శనివారం కూడా స్వామివారికి కళ్యాణ మహోత్సవం ఉంటుందని మధ్యాహ్నం జరిగే అన్నదాన కార్యక్రమం శ్రీ వివేకానంద సేవా సమితి అధ్యక్షులు గంగుమళ్ళ వరప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పులిగోళ్ళ శ్రీనువాస్‌యాదవ్, అంజమ్మ దంపతులు ఆలయ కమిటి సభ్యులు సిరికి శ్రీనువాస్, గుత్తికొండ రామకృష్ణ, బొంతు హరికృష్ణ, కలవల ఏడుకొండలు, కుక్కిరాళ్ళ ప్రకాష్‌రావు, రామారావు, సైదయ్య, పులిగోళ్ళ శ్రీలక్ష్మీయాదవ్, నాగమణి, వెంకన్న, ముమ్మారెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి, తుంగం రామారావు, వరలక్ష్మి, టి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

### -బిసి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 14,ప్రభాతవార్త:**

బడుగు బలహీనవర్గాలకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్యమైన ఆరోపణలు చేస్తున్న హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని బిసి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం విద్యానగర్‌లో ఆయన మాట్లాడుతూ బిసినాయకుడు మంత్రిగా ఉండటాన్ని చూసి ఓర్చుకోలేకనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. బూడిద అక్రమ రవాణా అంటూ ఆరోపణలు చేస్తున్న కౌశిక్‌రెడ్డి ఒకవేళ అక్రమాలు జరిగితే ఎందుకు అధికారులకు ఫిర్యాదు చేయలేదని విచారణ కోసం ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. కేవలం లేనిపోని ఆరోపణలు చేసి బిసిలను కించపరుస్తూ రాజకీయంగా ఎదగకుండా కుట్రలు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అగ్రకుల అహంకారంలో ఇలాంటి కుట్రలను బిసిసంఘాలుగా తాము తిప్పికొడుతామని వెంటనే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వైద్య శిబిరం

**అత్తాపూర్ జూన్14,ప్రభాతవార్త :**

ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని హెల్త్ సెంటర్‌లో నొప్పికి సంబంధిత రుగ్మతులపై దష్టి సారించి అత్యంత విజయవంతమైన ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించింది. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటిలో ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని విద్యార్థి వ్యవహారాల డిన్ డాక్టర్ సత్యనారాయణ, అసోసియేట్ డిన్ డా.నరేందర్ రెడ్డి,వ్యవసాయ కళాశాల ఇంచార్జ్ వైద్యాధికారి పద్మ వేణి ప్రారంభించారు.ఈ సందర్భంగా పెయిన్ స్పెషలిస్ట్‌లు డాక్టర్.నికిత,డా.చైతన్యలు అంకితభావంతో వారి బృందంతో కలిసి వైద్య పరీక్ష పరీక్షలు నిర్వహించారు. మొత్తం 15 బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు,150మంది రోగులకు సమగ్ర సంప్రదింపులు అందించబడ్డాయని తెలిపారు. అదే విధంగా వివిధ నొప్పికి సంబంధిత ఆందోళనలను పరిష్కరించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రర్ డాక్టర్ రఘురామ్ రెడ్డి మాట్లాడుతూ...ఇండో బ్రిటీష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ బృందం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వారు మరింత అంకితభావంతో మరిన్ని ఆరోగ్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించాలని అన్నారు.ఆరోగ్య శిబిరాలు యూనివర్సిటీ కమ్యూనిటీకి చాలా అవసరమైన సలహాలను అందించిందని కొనియాడారు.

**IN THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL - I, AT HYDERABAD**

**O.A.No. 60 OF 2024**

Between:
State Bank of India, Stressed Assets Recovery Branch, 2nd Floor, TSRTC Commuter Amenity Centre, Bus Terminal Complex, Koti, Hyderabad - 500 095, Represented by its Chief Manager ... Applicant
And
M/s. Balaji Trading Company, A Partnership Firm, Rep. by its Partner & Others ... Defendants

**SUBSTITUTED SERVICE OF SUMMONS UNDER RULE 23 (viii) OF DRT (PROCEDURE) RULES, 1993**

To
D-1) M/s. Balaji Trading Company, A Partnership Firm, Rep. by its Partner, Plot No.165/P, Aparna Palm Groove, Kompalli, Medchal, Malkajgiri District, Hyderabad.
D-2) Sri Allam Marreddy, S/o. A.Jogi Reddy, Aged: Major, Male, H.No.1-8-47, Plot No.52, Ganesh Nagar, Quthbullapur, Ranga Reddy District.

Where as the Applicant has instituted an Application under Sec.19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993, against you, for recovery of a sum of Rs.1,79,24.745/- together with future interest and other reliefs and the Hon'ble Tribunal ordered notice to you, by way of paper publication in "Vaartha" Telugu Daily News Paper, Hyderabad edition and posted the matter to 8-7-2024.

You are hereby required to show cause on 8-7-2024 at 10.30 A.M. at Debts Recovery Tribunal -1, 3rd Floor, Triveni Complex, Abids, Hyderabad-500 001, in Person or by Advocate, as to, why the relief prayed for should not be granted. Take notice that, in case of default, the application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this 13th day of June, 2024.

**ASST. REGISTRAR**
**Debts Recovery Tribunal-1**
**3rd Floor, Triveni Complex**
**Abids, Hyderabad - 500 001**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE AND SESSION JUDGE-CUM- II ADDL. FAMILY COURT, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL**

**G.W. O.P. No. 13 OF 2024**

Between:
Smt. Gunda Gouthami & another, ...Petitioners
AND
All the concerned ...Respondents
To
ALL THE CONCERNED

**NOTICE**

Please take notice that the above named Petitioners viz., Smt. Gunda Gouthami and Smt. Gunda Manyamma have filed above Petition for appointment the Petitioner No.1 as a guardian of her minor son and daughter namely; Master Gunda Ritheesh and Kumari Gunda Sai Varshini and to grant permission to alienate and transfer the minor share of the property mentioned below by executing and registering the Sale Deed in favour of the agreement holder viz., Sri.Amgoth Prem Kumar Nayak and/or his nominee/s from out of the Petition Schedule Property i.e., All that the Plot of land admeasuring 200 Sq. Yards equivalent to 167.2 Sq. Meters, bearing Plot No.102, together with ACC room with plinth area of 100 Sq. Ft bearing H.No.7-904, forming part of Survey No.33/8 to 33/11, situated at Subash Nagar of Jeedimetla Village, Quthbullapur Mandal & Municipality, under GHMC circle, Medchal-Malkajgiri District, erstwhile Ranga Reddy District, Telangana State and the same is bounded by; NORTH:30' wide Road; SOUTH: Plot No.101; EAST: 30'wide Road; and WEST : Plot No.81;

The above Petition is posted to 20-06-2024 for appearance. Any person/s having any claim or intended to oppose the sale of the minor's property by the Petitioners are hereby summoned to appear either in person or through an Advocate with your defense if any, before the Hon'ble Court at 10:30 a.m. on the above date and time, failing which, the above Petition will be heard and decided exparte.

**(BY ORDER OF THE HON'BLE COURT)**
**Sd/- A.VENKATESWARLU**
**T.Srikanth and Ram Narayana**
**ADVOCATES**
**Plot No.34, Sri Krishna Nagar, L.B.Nagar, Hyderabad-74. Mob: 98850 24297.**

# మహిళలను వేధిస్తున్న ఆకతాయిలను పట్టుకున్న పోలీసులు

## 15 రోజుల్లో 147మంది ఆకతాయిలను పట్టుకున్న చేసిన రాచకొండ షీ టీమ్స్



మహిళలను వేధించిన వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిబ్బంది..

**నేరెడ్‌మెట్ జూన్14 ప్రభాతవార్త:** బాలికలు, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీటీమ్స్ పోలీసులు వదిలపెట్టే ప్రసక్తే లేదని, తమను వేధించిన పోకిరీలపై మహిళలు, యువతులు నిర్భంయగా వచ్చి ఫిర్యాదు చేయాలని రాచకొండ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి తెలిపారు. బాలికలు, మహిళలు, యువతులను కాపాడేందుకు తమ బృందాలు బస్టాండ్, కళాశాలలు, రైల్వేస్టేషన్లు, కూరగాయల మార్కెట్లు, బాహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతున్నారన్నారు. మహిళలను వేధించే వారిని సాక్షాధారాలతో పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తూ వారిని,వారి తల్లిదండ్రుల సమయంలోనే కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో మహిళలు, బాలకలు, యువతులను వేధింపులకు గురిచేస్తున్న 147 (మేజర్స్-87, మైనర్స్-60) మందిని షీటీమ్స్ పట్టుకోవడం జరిగిందన్నారు. వారికి ఎల్బీనగర్ సీపి క్యాంపు కార్యాలయంలో వారి కటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. గతనెల 16వ తేదీ నుండి 31వ తేదీ వరకు 183 ఫిర్యాదు అందాయని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసిపి టి. ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఫిర్యాదులు అందిన వాటిలో 30 సెల్‌ఫోన్లు, 42 సోషల్ మీడియా, 111 నేరుగా అందాయన్నారు. వాటిలో 11 క్రిమినల్ కేసులు, పెట్టికేసులు 83, 59 మందికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. మహిళలు, బాలికలు, యువతులను వేధిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వేధింపులకు గురైన వారు నేరుగా సీపి కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వెంకటేశం, అడ్మిన్ ఎస్సై రాజు, షీటీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులను వెంటనే అందజేయాలి : పోల్కం శ్రీనివాస్



మంత్రి రాజనర్సింహ్మాకు వినతి పత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

**మలక్‌పేట, జూన్ 14 ప్రభాతవార్త:** పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులను ప్రభుత్వం వెంటనే అందజేయాలని టిపిసిసి ఒబిసి సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ అనే వ్యక్తి కిడ్నీ సమస్యతో దయాలసిస్‌కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆరోగ్యశ్రీ, తెల్ల రేషన్‌కార్డులు పేదలకు అందజేసి రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలపై బిజేపీ నేతల పాదయాత్ర



సమస్యలను తెలుసుకుంటున్న మేకల సారంగపాణి బిజేపీ శ్రేణులు

**తార్నాక, జూన్ 14 ప్రభాతవార్త :** బిజేపీ డివిజన్ అధ్యక్షులు రాముపర్మ ఆధ్వర్యంలో శుక్రవారం తార్నాక డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణితో పాటు పలువురు బిజేపి శ్రేణులు బస్తీల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లో ఎక్కడచూసినా రోడ్లుగుంతలమయంగా మారాయని వాటిని మరమ్మతులు చేయించడంలో అధికారులు పూర్తిగా విఫలమౌతున్నారని ఆరోపించారు. అనంతరం వారు గుర్తించిన సమస్యలను జోనల్ కమీషనర్, డిసికి వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌గౌడ్, పోచయ్యయాదవ్, ప్రకాష్‌గౌడ్, బిక్షపతియాదవ్, జమ్మికుంట వేణు, రామకృష్ణ, శ్రీనివాస్‌చారి, కృష్ణమూర్తి, ప్రమోద్‌కుమార్, గోవర్ధన్, ఉపేందర్‌యాదవ్, కరుణాకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలు సంతోషాలతో వుండాలి : ఉప్పల



హోమంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త తదితరులు

**వనస్థలిపురం, జూన్ 14 ప్రభాతవార్త:** దుర్గామాత ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో -కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్ నేషనల్ ది పార్ట్ ఆఫ్ ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ కోటేశ్వరరావు రాష్ట్ర మేనేజర్ అయిత హైమ, నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ తెలంగాణ ఆధ్వర్యంలో ఎంఇ గార్డెన్ వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన ఏకాహ్నిక దీక్షా పూర్వక చటర్దేద స్వాహకార పురస్వర దుర్గా సప్తశతి పూర్వక అష్టోత్తర హోమ గుండాత్మక చండి హసనం కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తలు మాట్లాడుతూ శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శివ స్వామీజీ పర్యవేక్షణలో చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెలిదె రవి కుమార్, చింతల రజినీకాంత్, ఎల్‌వి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్‌సిఏబి వైస్ చైర్మన్‌గా కొత్తకుర్మ సత్తయ్య



కొత్తకుర్మ సత్తయ్యను సన్మానిస్తున్న సంఘం పాలకవర్గ సభ్యులు

**తుర్కయాంజల్, జూన్ 14 ప్రభాతవార్త:** ది తుర్కయాంజల్ రైతు సేవా సహకార బ్యాంక్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్ (టీఎస్‌సిఏబి) వైస్ చైర్మన్‌గా కొత్తకుర్మ సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం పాలకవర్గం, ఇతర సభ్యులు, సిబ్బంది సత్తయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం సత్తయ్య మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పజెప్పినందుకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, కూతడి నర్సింగరావు, వంగేటి లక్ష్మారెడ్డి, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, సంఘ సెక్రెటరీ వై.రాందాస్, సిబ్బంది, సభ్యులు కొండ్రు శ్రీనివాస్, టి. అశోక్, జీ. స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి



అధికారులతో కలసి సమస్యను పరిశీలిస్తున్న జంగం మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పూర్ణోదయ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు పరిశీలించిన అనంతరంనఆయన మాట్లాడుతూ వర్షం పడినప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులతో కలసి సమస్యను పరశీలించడం జరిగిందన్నారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు అన్సారి, సయ్యద్ మినాజ్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి: చింతల

**ఎల్.బి.నగర్, జూన్ 13 ప్రభాతవార్త:** జైపురి కాలనీలోని ప్రబుత్వ పాఠశాలలో ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జైపురి కాలనీ ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 1వ తరగతిలో నూతనంగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని, ప్రభుత్వ బడుల్లో అన్ని వసతులున్నాయని ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి, కాలనీ పెద్దలు మహిళా సంఘాల సభ్యులు,తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను చేరుకోవాలి : కౌన్సిలర్లు

**హయత్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులుంటారని వారి బోధనలను ఒంటబట్టించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కౌన్సిలర్లు పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేటలోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య పుస్తకాలను వారు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేయాలన్న గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దుచేసి వాటిని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించడం హర్షనీయమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రారెడ్డి, నాయకులు బొర్రసురేష్ పాల్గొన్నారు.

## డీసీసీ ప్రధాన కార్యదర్శిగా హర్షలత

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం నియోజకవర్గం ఆర్.కె.పురం డివిజన్ కు చెందిన తమలపాకుల హర్షలత నియమిస్తూ శుక్రవారం కాంగ్రెస్ రంగారెడ్డిజిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హర్షలత మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రబుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చిన పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, వర్కింగ్ అధ్యక్షులు మహేష్ గౌడ్ కు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమస్యలు పరిష్కరించండి : రంగా నర్సింహ్మా

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త :** డివిజన్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను శుక్రవారం కలిసి డివిజన్ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. డివిజన్‌పరిధిలో రోడ్లు అద్వానంగా ఉన్నాయని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఆయా పనులకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామ్మోహన్, వెంకటరమణ పాల్గొన్నారు.

## కొత్తపేట సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ వినతి



జడ్‌సి పంకజకు వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలోని కాలనీలలో ఉన్న సమస్యలను పరిష్కరించేవిధంగా చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ సమస్యలపై ఎల్బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ పంకజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రీపురంకాలనీ, నాగేశ్వర్‌నగర్, శ్రీ రామలింగేశ్వరకాలనీ, బృందావన్ కాలనీల మీదుగా మూసి నదికి బాక్స్ డ్రైనేజ్‌లైన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, బాక్స్ డ్రైనేజ్ లైన్ ఎస్‌ఆర్‌ఎల్ కాలనీనుంచి గాయత్రిపురం కాలనీ వరకు పనులు అర్ధాంతరంగా మధ్యలోనే అపివేయడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని అన్నారు. రోడ్లు గుంతలమయంగా వాహన చోదకులు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీటి కారణంగా కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, బాక్స్ డ్రైనేజ్ లైన్ పనులు పూర్తి చేసి రోడ్లు నిర్మించాలని జోనల్‌కమిషనర్‌ను కోరారు. సత్యనగర్, భరత్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో నూతన రోడ్లు నిర్మించాలని కోరారు. అందుకు స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కండి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సూపరెండెంట్ డా. కమల నాయకులు సాయిజన్ శేఖర్

**నాచారం, జూన్ 14 ప్రభాతవార్త :** రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం ఇఎస్ఐ హాస్పిటల్లో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హాస్పిటల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ముఖ్యఅతిథులుగా హాజరై సూపరెండెంట్ డా. కమల, కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు సాయిజన్ శేఖర్‌తో కలిసి ప్రారంభించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. అనంతరం బ్లడ్ బ్యాంక్‌ను, ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేసేలా యువకులను మరింత ప్రేరేపించాలని విజ్ఞప్తి చేశారు. రక్తం అత్యవసర సమయాల్లో దొరకక ఎంతో మంది అనేక ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారి కోసం రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు, మారయ్య, ఆర్‌ఎంఓ స్వేత, డా. చీమ శ్రీనివాస్, డా. మధు, డా. రజ్వంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



విద్యుత్ అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 14 ప్రభాతవార్త :** వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ డిఇ సూర్యనారాయణను కలిసి విద్యుత్ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం విద్యుత్ అందించాలని ఆదేశించిందని, వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులందరికి విద్యుత్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాశికంటి నాగరాజు, గరిక సుధాకర్, కాలనీ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, బాబురావు, దర్మేందర్‌నాయక్ అజీద్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : పరమేశ్వర్‌రెడ్డి...** ప్రజా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం. పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్‌లో పలువురు స్థానికుల నుంచి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

## రామిడి కళావతినగర్ శ్రీలతకు డాక్టరేట్



పరిశోధనా వ్యాసాన్ని సమర్పిస్తున్న శ్రీలత

**సరూర్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ రామిడి కళావతినగర్‌కు చెందిన ఎం.శ్రీలత ఉస్మానియా యూనివర్సిటీనుండి డాక్టరేట్ సాధించారు. ఎఫిసియెంట్ స్పెక్ట్రమ్ యుటిలైజేషన్ అండ్ ఛానల్ ఓవర్ హెడ్ మిటిగేషన్ ఇన్ ఎ కాగ్నిటివ్ రేడియో నెట్‌వర్క్‌పై ఆమె సమర్పించిన పరిశోధనా వ్యాసానికి గాను ఆమెకు ఓయు ఎలక్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (ఈసిఇ) విభాగం నుండి డాక్టరేట్ పట్టా లభించింది. ఆమె సమర్పించిన వ్యాసాన్ని పరిశీలించిన నిపుణుల బృందం సిఫారసు మేరకు ఆమెకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు అభించింది. కృత్రిమ మేధను (ఆర్టిఫిషి యల్ ఇంటలిజెన్స్) ఉపయోగించి మొబైల్ నెట్‌వర్క్‌లో ప్రస్తుత మరియు భవిష్యత్తుల్లో ఎదురయ్యే సమస్యలకు ఆమె పరిశోధించి చేసిన ప్రతిపాదనలు ప్రపంచస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మక ఉచిత స్కూపస్, స్ప్రింజెర్, ఈఎస్‌సిఐ, ఎస్‌సిఐఈ వంటి పరిశోధనా పత్రికలు ప్రచురించడం విశేషం. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఆచార్యురాలు డాక్టర్ ఎ.భారతి, మాజీ ఆచార్యురాలు డాక్టర్ రాళ్ళపల్లి హేమలత పర్యవేక్షణలో చేసిన పరిశోధనలు ఆమెకు డాక్టరేట్ సాధించిపెట్టాయి.

## రావినారాయణరెడ్డి కాలనీలో గుడిసెల తొలగింపు యత్నం... ఉద్రిక్తత....

**హయత్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ గ్రామం భూదాన భూమిలో సీపీఐ ఆధ్వర్యంలో పేదలు వేసిన గుడిసెలను తొలగించాలన్న రెవెన్యూ అధికారుల యత్నం ప్రస్తుతానికి వాయిదా పడింది. గుడిసెలను తొలగించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం రాత్రినుంచి యత్నాలు ప్రారంభించారు. తహశీల్దార్ రవీందర్‌దత్తు ఆధ్వర్యంలో కాలనీలో సీసీకెమెరాలను ఏర్పాటుచేయడంతో పాటు గుడిసెల తొలగింపుకోసం జేసీబీలను సిద్ధం చేశారు. ఈక్రమంలో గుడిసెవాసులంతా ఏకమై అధికారుల యత్నాలను అడ్డుకునేందుకు సిద్ధమవడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. పోలీసు బందోబస్తును అడ్డుకునేందుకు గుడిసెవాసులు కర్రలు, రాళ్లను సిద్ధం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం దాదాపు రెండువేల మంది సమావేశమై గుడిసెలను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ క్రమంలో శుక్రవారం తహశీల్దార్, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కాలనీకి చేరుకుని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డిలతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తాము గుడిసెలను తొలగించడం తప్పదన్నారు. దీనిపై నాయకులు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో లేనిది ఇప్పుడెందుకు గుడిసెలను తొలగించేందుకు వస్తున్నారని ప్రశ్నించారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఇళ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని వారికి ఇళ్ల స్థలాలను ఇవ్వాలని లేనిపక్షంలో డబుల్ బెడ్‌రూంలను కేటాయించాలన్నారు. అప్పటి వరకు గుడిసెల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వంతో చర్చించడానికి వారం రోజుల గడువు కావాలని నాయకులు అడగ్గా... వారంలో సానుకూల చర్యలు లేనిపక్షంలో గుడిసెల తొలగింపు తప్పదని చెప్పి తహశీల్దార్, ఇన్‌స్పెక్టర్ అక్కడినుంచి వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## నందనవనంలోని ప్రైమరీ స్కూల్ హైస్కూల్‌గా మార్పు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



విద్యాశాఖ ఛీఫ్ సెక్రటరీ వెంకటేశంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, జూన్ 14 ప్రభాతవార్త:** హస్తినపురం డివిజన్ నందనవనంలోని ప్రైమరీ స్కూల్‌ను హైస్కూల్‌గా (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) మంజూరు చేస్తున్నట్లు జీ.ఓ. జారీ చేసినట్లు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విద్యాశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఎనిమిదవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతిలోకి దాదాపు 88 విద్యార్థులు ఉన్నారని, వచ్చే సంవత్సరం పదవ తరగతి ప్రారంభం కానుందన్నారు. గతంలో ఈ స్కూల్ భవనంపై మరో అదనపు అంతస్థు నిర్మాణం కోసం విద్యాశాఖ నుంచి 44 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, వచ్చే పదవ తరగతి విద్యార్థుల కోసం మరొక అదనపు అంతస్థు నిర్మాణం చేపడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని గుర్తు చేశారు. అదేవిధంగా పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని కోరారు. ఈ ప్రైమరీ స్కూల్ హైస్కూల్‌గా రూపాంతరం చెందడానికి మాజీ కార్పొరేటర్ పద్మశ్రీనివాస్‌నాయక్‌తోపాటు ఇతర నాయకులు కృషి చేసారని అన్నారు. అనంతరం వెంకటేశం మాట్లాడుతూ ఈ ప్రైమరీ స్కూల్‌ను హైస్కూల్‌గా మార్చనున్నట్లు ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదనపు ఉపాధ్యాయుల నియామకంతోపాటు పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హస్తినపురం డివిజన్ సీనియర్ నాయకులు రామావత్ శ్రీనివాస్‌నాయక్, అనంతుల రాజిరెడ్డి, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : కొమిరెల్లి



సమస్యల గురించి తెలుసుకుంటున్న రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, జూన్ 14 ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ ఓబిసి వైస్ ఛైర్మన్ చౌకి రవికుమార్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు స్కూల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కార్యాలయంలో వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న సమస్యలు తమ దృష్టికి రావడంతో పాఠశాలను సందర్శించడం జరిగిందన్నారు. పాఠశాలలో పలు సంవత్సరాలనుండి విద్యుత్ సరఫరా లేదని, వెనుకవైపు ప్రహారీగోడ సరిగా లేదని మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు సరిగా లేవని సంవత్సరాలనుండి మరమ్మతులు చేయలేదని వెంటనే పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.

## చంపాపేట ఎంపిపిఎస్‌లో సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

**సైదాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** చంపాపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా బడిలో చేరిన చిన్నారులతో అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేశారు. గ్రీన్ రివల్యూషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లీల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చదువు యొక్క ప్రాధాన్యతను, మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో రమేష్ గురూజి, పాఠశాల ప్రాధానోపాధ్యాయులు మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మి, సుదేష్ణ, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, రాంరెడ్డి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, జూన్ 14 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని గడ్డిఅన్నారంలో డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు.అదేవిధంగా గడ్డిఅన్నారం ప్రభుత్వ పాఠశాల శాలివాహననగర్ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్కూల్ ప్రిన్సిపల్‌తో కలిసి పనులలో జాప్యం, నాణ్యత తదితర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా బస్తీలో వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యల గురించి స్థానిక ప్రజలకు ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్స్ శారద, కనకవల్లి, హరిచంద్ర, ఉపాధ్యాయురాలు జనమిత్ర, స్థానికులు ప్రభాకర్, ధనరాజ్, సందీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న కొప్పుల దినేష్

**మలక్‌పేట, జూన్ 14 ప్రభాతవార్త :** ప్రజలసంక్షేమంకోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మూసారాంబాగ్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు కొప్పుల దినేష్ పేర్కొన్నారు. మూసారాంబాగ్ నుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డిని నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.